# మిసెస్ పరాంకుశం

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



*1971 లో మల్లాది గారి కలం నుంచీ వెలువడిన రెండవ నవల*

*(క్రిందటి సంచిక నుంచీ కొనసాగింపు)*

## 7

ఎవ్వరినీ మరచిపోకుండా చాలామందిని పిలిచాడు పరాంకుశం రిజిష్టర్ మారేజ్‌కి. ఉదయం పదకొండున్నరకి పెళ్ళి. ముందు రోజు రాత్రే పరాంకుశం అక్కయ్య ఇల్లు శుభ్రంగా కడిగి, గుమ్మాలకి మామిడి తోరణాలని కట్టింది.

అయిదు నిమిషాల్లో అయిపోయింది పెళ్ళి, సాక్షి సంతకాలని శ్రీకంఠం, ఇన్‌స్పెక్టర్లు చేసారు. శ్రీకంఠం తెచ్చిన దండలు ఒకరి మెడలో ఒకరు, అందరూ చప్పట్లు కొడుతూండగా వేసారు, సౌదామిని సిగ్గుని మొదటిసారిగా పరాంకుశం, పరాంకుశం అక్కయ్య గమనించారు.

రెండు మూడు కెమేరాలు క్లిక్ మన్నాయి, పత్రికా విలేఖరులవి. ఇన్‌స్పెక్టర్ ద్వారా ఆ ఆదర్శవివాహం సంగతి తెలుసుకుని వచ్చారు వాళ్ళు.

అరగంట తర్వాత దగ్గరే ఉన్న ఓ హోటల్లో అంతా సమావేశమయ్యారు. ఆడవాళ్ళంతా ఓ వైపు, మగవాళ్ళంతా మరోవైపు కూర్చున్నారు. పరాంకుశం కొలీగ్స్ భార్యలతో సహా ఆ పెళ్ళికి వచ్చారు.

పరాంకుశానికి ఇష్టం లేకపోయినా, ఇద్దరు ముగ్గురు పరాంకుశాన్ని పొగుడుతూ మాట్లాడారు. ఇన్‌స్పెక్టర్ ఇలా యువకులంతా ముందంజ వేసి వ్యభిచారాన్ని సమూలంగా నాశనం చెయ్యాలని కొంచెం ఉద్రేకంగానే ఉపన్యాసధోరణిలో చెప్పుకుపోయాడు.

భోజనం అనగానే అంతా ప్రెజంటేషన్స్ అందించి సెలవు తీసుకుని వెళ్ళిపోయారు. మధ్యాహ్నం రెండుగంటలకల్లా పెళ్ళితంతు అయిపోయింది.

సౌదామినికి అంతా వింతగా, కొత్తగా ఉంది. అసలు పెళ్ళి అలా జరుగుతుందనీ, అంతమంది వస్తారని కూడా అనుకోలేదు. వంద మందిపైనే వచ్చారు పెళ్ళికి.

సౌదామినికి పరాంకుశం ముందరే చెప్పాడు, రిజిస్ట్రార్ ఆఫీసులోగానీ, హోటల్లోగానీ ఏ విధంగా ప్రవర్తించాలి, ఏం మాట్లాడాలి, ఏం మాట్లాడకూడదు. పరాంకుశం అక్కయ్య చాలా విషయాల్లో శిక్షణ ఇచ్చింది.

కాని, రెండు సందర్భాల్లో పరాంకుశం మొహం సిగ్గుతో కందిపోయింది. తల ఎత్తలేకపోయాడు. సౌదామిని ఎవరితోనో మాట్లాడుతూ అలవాటు చొప్పున నాలుగయిదు అసహ్యమైన బూతుమాటలు మాట్లాడినప్పుడు, రెండవసారి హోటల్లో భోజనం

వడ్డిస్తున్నప్పుడు ఒక సర్వర్ రహస్యంగా మరొక సర్వర్‌తో సౌదామినిని తను ఆ సందులో చాలా సార్లు అనుభవించానని చెప్పటం విన్నప్పుడు. నెమ్మదిగా చెప్పినా, ఆ మాటలు చాలామంది విన్నారు, దానికి తోడు సౌదామిని ఆ సర్వర్‌ని గుర్తుపట్టి పలకరించింది.

"మా ఇద్దరికీ పెళ్ళి అయింది." ఆ సర్వర్‌తో చెప్పింది పరాంకుశం భుజం తట్టి.

గుమ్మం దగ్గర నూతన దంపతులకి ఆహ్వానం పలికేందుకు ఏర్పాట్లు చేయడానికి పరాంకుశం అక్కయ్య ఓ రిక్షాలో ముందరే వెళ్ళిపోయింది. పరాంకుశం, సౌదామిని మరో రిక్షాలో వెనకాల బయలుదేరారు.

"సౌదామినీ! పాత విటులు ఎప్పుడైనా కనిపించినా, పలకరించకు. వాళ్ళు పలకరించినా మాట్లాడకు." చెప్పాడు పరాంకుశం రిక్షాలో వెళుతూ.

"దేనికి? మాట్లాడితే ఏం తప్పు?"

"మర్యాద కాదు. అసలు పరాయి మగాడితో మాట్లాడకూడదు నువ్వు. తప్పు."

"ముందరే చెప్పా, అలా అన్నావంటే నిన్ను వదిలి వెళ్ళిపోతానని. ఇప్పుడు పెళ్ళయిపోయిందిగా. నిన్ను వదిలేసినా నాకు నీ జీతంలోంచి కొంత డబ్బిస్తారు. హాయిగా బ్రతకవచ్చు. మనిద్దరికీ పెళ్ళయినట్లు ఆ పుస్తకంలో రాసుకున్నారు, సాక్ష్యం చెప్పడానికి ఇంకా బోలెడంతమంది చూశారు కూడా."

పరాంకుశం సౌదామిని కళ్ళలోకి చిరు కోపంగా చూసాడు.

"అలాంటి పిచ్చి వేషాలు వేస్తే జాగ్రత్త." నవ్వుతూ చెప్పాడు.

"నా ఇష్టం." విలాసంగా జడతిప్పుతూ చెప్పింది సౌదామిని.

"నీ అంతట నువ్వు వెళ్ళిపోతే నా జీతంలోంచి చిల్లిగవ్వ కూడా కోర్టు ఇవ్వనివ్వదు. నా అంతట నేనే నిన్ను వదిలేస్తే ఇవ్వాల్సి వస్తుంది. అని నేను నీకు చెప్పడం మరిచిపోయానా? లేక నీకు గుర్తులేదా?"

"అలాగా..!?"

"అయినా, మన పెళ్ళయి ఇంకా గంట అయిందో లేదో. విడిపోవటం గురించి దేనికి ఆలోచిస్తావు."

"ఊరికినే. పోనులే."

"నువ్వు నా భార్యవి." సౌదామిని చెయ్యి పట్టుకుని ఆప్యాయంగా చెప్పాడు పరాంకుశం. "నేను నీ భర్తని. కొన్ని నీకు ఇష్టం లేనివి నేను మానేయాలి. నాకు ఇష్టంలేనివి నువ్వు మానేయాలి. సరేనా?"

సౌదామిని పగలబడి నవ్వింది. పరాంకుశం తనవంకే చూస్తుండటం గమనించి గబుక్కున నవ్వటం ఆపింది.

"ఓహో! అలా పగలబడి నవ్వకూడదని చెప్పావు కదూ బుల్లోడా! నవ్వనులే. ఇవాళ సినిమాకి తీసుకెళ్ళు"

"అలాగే."

"సౌదామినీ! ఎక్కడికి వెళుతున్నావు?"

ఓ మగ కంఠం వినపడింది.

పరాంకుశం ఉలిక్కిపడి రిక్షాలోంచి బైటికి చూసాడు. రిక్షా పక్కనే సైకిలు తొక్కుతూ ఒకతను సౌదామిని వంక చూస్తూ వస్తున్నాడు.

"పెళ్ళి చేసుకున్నాను." సౌదామిని చెప్పింది సంతోషంగా.

"ఎవరిని? నీకు పెళ్ళా! నిన్నెవరు చేసుకున్నది?"

"వీరే."

"రిక్షా ఆపు."

సైకిల్ హాండిల్ బార్‌ని ఎడంచేత్తో కంట్రోల్ చేస్తూ కుడిచేత్తో రిక్షా అంచుని పట్టుకుని వస్తున్నాడు అతను.

"నిన్నే! రిక్షా ఆపు." అరిచాడు గట్టిగా.

రిక్షా తొక్కే అతను రిక్షాని ఆపాడు. రిక్షా ఆగగానే అతను సైకిల్‌కి స్టాండు వేసి పరాంకుశం వంక చూస్తూ చెప్పాడు.

"దిగు"

"దేనికి?"

"దిగు చెపుతాను."

పరాంకుశం రిక్షా దిగాడు.

"రిక్షా నా వెనకపోనీ." రిక్షావాడితో చెప్పాడు అతను సైకిల్ స్టాండ్ తీస్తూ.

పరాంకుశం అతడి వంక చూసాడు. ముప్పై అయిదు, నలభై మధ్య ఉంటుంది వయసు. బలంగా లావుగా ఉన్నాడు. గుబురు మీసాలు, పొడుగు చేతుల జుబ్బా, గళ్ళలుంగీ.

"సౌదామినిని నేను పెళ్ళి చేసుకున్నాను." చెప్పాడు పరాంకుశం.

విరగబడి నవ్వాడు అతను. అతని నవ్వుని చూసి సౌదామిని కూడా విరగబడి నవ్వటం ప్రారంభించి, పరాంకుశం తనవంకే రెప్పవాల్చకుండా చూడటం గమనించి నవ్వటం ఆపేసింది చప్పున.

"పెళ్ళా? పాతిక పారేస్తే దానికీ, నాకూ పెళ్ళవుతుంది ఈ రాత్రికి. సానికి పెళ్ళేమిటి?"

"ఇందాకే రిజిస్టర్ మారేజ్ చేసుకున్నాం."

"అవును. పెళ్ళిళ్ళ ఆఫీసు నుంచే తీసుకువస్తున్నాను ఇద్దరినీ." చెప్పాడు రిక్షావాడు అతనితో.

"దీనికి పెళ్ళా? ఇలాంటి దాన్ని పెళ్ళి చేసుకున్నానన్న మిషతో ఎగరేసుకుపోతే మాగతి ఏంకాను? నేనూ చేసుకుంటాను పెళ్ళి, పెళ్ళట పెళ్ళి. సానిదానితో పెళ్ళి"

"పిచ్చి పిచ్చిగా వాగకు." కోపంగా చెప్పాడు పరాంకుశం.

"నా సంగతి నీకు సరిగా తెలియదేమో. పబ్లిక్ ప్రాపర్టీని ఎగరేసుకుపోతుంటే చూస్తూ దద్దమ్మలా కూర్చోను." మీద మీదకి వచ్చాడు ఆ రౌడీ.

"ఖబడ్దార్." చేతులు ముడిచాడు పరాంకుశం.

వాడు 'అరేయ్' అని పెద్దగా అరిచి, సైకిల్ దిగి పరాంకుశం మీదకి దూకాడు. పరాంకుశం, అతను కలియబడ్డారు.

పరాంకుశం, ఆ రౌడీ సైకిల్ చైన్ తీసుకున్నాడు. రెండు మూడు గట్టి దెబ్బలు పడ్డాయి పరాంకుశం ఒంటిమీద. పరాంకుశం తన కోసం దెబ్బలు తింటుంటే సౌదామినికి జాలివేసింది.

"ఆగు." అరిచింది రిక్షాలోంచి దిగి.

ఇద్దరు కానిస్టేబుల్స్ పరుగెత్తుకొచ్చారు. పరాంకుశాన్ని ఒకరు, ఆ రౌడీని మరొకరు పట్టుకుని ఆపారు. సౌదామినితో పాటు వాళ్ళిద్దర్నీ స్టేషన్‌కి తీసుకెళ్ళారు.

దుమ్ముతో మాసిపోయి ఉన్న పరాంకుశం బట్టలని, నీట్లోంచి, ముక్కులోంచి కారుతున్న రక్తాన్ని, ఒంటిమీద సైకిల్ చెయిన్ వాతలని చూసి ఇన్‌స్పెక్టర్ ఆశ్చర్యపోయాడు.

"ఏమయింది?" అడిగాడు.

పోలీసులు ఇద్దరూ జరిగింది చెప్పారు.

"అందుకు వీళ్ళని స్టేషన్‌కి తీసుకొస్తారా? బుద్ధి లేదూ మీకు? వాళ్ళిద్దరూ భార్యాభర్తలు. ఇప్పుడు వాళ్ళ పెళ్ళికే వెళ్ళివచ్చాను. ఇడియట్స్. ఈ రౌడిని లాకప్‌లో పెడేయండి." ఇన్‌స్పెక్టర్ వాళ్ళమీద అరిచాడు. "సో సారీ మిష్టర్ పరాంకుశం.

సౌదామిని ఆ రౌడీ దగ్గరికి వెళ్ళి ఆవేశంగా ఈ చెంపా, ఆ చెంపా వాయించింది.

"వాడి సంగతి మేం చూసుకుంటాం. మీరు వెళ్ళండమ్మా." చెప్పాడు ఇన్‌స్పెక్టర్.

పోలీస్ జీప్ డ్రయివర్‌ని పిలిచి వాళ్ళని ఇంటి దగ్గర డ్రాప్ చేసి రమ్మని చెప్పాడు ఇన్‌స్పెక్టర్. ఇంటికి వెళుతూ నూతన దంపతులిద్దరూ మౌనంగా ఎవరి ఆలోచనల్లో వాళ్ళు ఉండిపోయారు.

"ఆ రౌడీని ఎందుకు అలా కొట్టింది? నా మీద ప్రేమతోనా?" అనుకున్నాడు పరాంకుశం.

*"రెయిడింగ్స్‌లో ఎప్పుడైనా చిక్కితే నీచంగా చూసే తనని 'అమ్మా' అని గౌరవంగా సంబోధించాడు ఇన్‌స్పెక్టర్. ఇల్లాలయితే ఇంత మర్యాద లభిస్తుందన్నమాట." అనుకుంది సౌదామిని.*

నీళ్ళుతోడటానికి బావి దగ్గరకు వెళుతున్న పరాంకుశం అక్కయ్య మట్టికొట్టుకుపోయిన బట్టలతో, నెత్తురు మరకలతో పోలీస్ జీప్‌లోంచి దిగిన పరాంకుశాన్ని చూసి ఆశ్చర్యపోయింది. చేతిలోని బిందెని కింద పడేసి తమ్ముడి దగ్గరికి పరిగెత్తుకు వచ్చింది.

"అయ్యయ్యో! ఏం జరిగింది? ఆ వేషం ఏమిటి? ఎవరితోనైనా దెబ్బలాట అయిందా?" అడిగింది.

"అవును. కొట్టుకున్నారు." చెప్పింది సౌదామిని.

"ఎవరితో? గట్టి దెబ్బలేమైనా తగిలాయా?" ఖంగారుగా అడిగింది పరాంకుశం అక్కయ్య తమ్ముణ్ణి.

"పెద్దగా తగల్లేదు. వేణ్ణీళ్ళు కాపడం పెట్టు." పొడిగా చెప్పి పరాంకుశం లోపలికి వెళ్ళిపోయాడు.

మధ్యాహ్నం పోస్ట్‌లో పరాంకుశానికి ఓ రిజిస్టర్ పార్సెల్ వచ్చింది. సంతకం పెట్టి, ఆ పార్సిల్‌ని తీసుకుని విప్పతీసాడు. హైదరాబాదు నుంచి అసోసియేషన్ ఆఫ్ మోడరల్ ఎండ్ హైజిన్‌లో పనిచేసే నాయుడు పంపించిన పార్సెల్ అది. అందులో పరాంకుశం పెళ్ళికి బహుమతిగా అరడజను పుస్తకాలు ఉన్నాయి.

అన్నీ పరాంకుశానికి పనికివచ్చేవీ, సౌదామినితో సంసార జీవితంలో సహకరించేవి.

నాయుడు సంతకం ఉన్న తెల్లటి కార్డు మీద ఇంగ్లీషులో అందంగా టైప్ చేయబడి ఉన్నాయి మూడు వాక్యాలు.

"ప్రాస్టిట్యూట్ ఈజ్ ఏ పబ్లిక్ ఫారెస్ట్.

కన్‌కుబైన్ ఈజ్ ఏ ప్రైవేట్ సాంక్చురి.

వైఫ్ ఈజ్ ఏ పర్సనల్ గార్డెన్."

ఆ రిజిస్టర్ పార్సెల్‌తో పాటు అమ్మాజీ నుంచి ఓ కార్డు వచ్చింది. ఆ కార్డు మీద తెలుగులో అందంగా రెండే రెండు వాక్యాలు రాసి ఉన్నాయి.

"మీరు చేసిన పని సాహిత్యంలో రాణిస్తుంది. నిజ జీవితంలో కాదు."

నాయుడు పంపిన ఆ పుస్తకాలని తిరగేసాడు. అవి తనకి బాగా ఉపకరిస్తాయని గ్రహించాడు పరాంకుశం, వ్యభిచారుల గురించి, వాళ్ళ మనస్తత్వాల గురించి, వాళ్ళతో వివాహ జీవితంలో ఎదురయ్యే సమస్యల గురించి వ్రాసిన పుస్తకాలే అవన్నీ.

తను పంపిన వెడ్డింగ్ కార్డుకు ప్రతిగా పుస్తకాలు పంపిన నాయుడు మీద పరాంకుశానికి మనసంతా కృతజ్ఞతతో నిండిపోయింది. అసలు నాయుడు సమయానికి కనపడి సహాయం చెయ్యకపోతే అనేక సమస్యలు తొలిగి తన వివాహం ఇంత త్వరగా అయిఉండేది కాదు.

వెంటనే నాయుడికి కృతజ్ఞతలు తెలియజేస్తూ ఉత్తరం రాసి పోస్ట్ చేసాడు.

✷✷✷

"ఇక్కడే పడుకుంటావా?" అడిగింది సౌదామిని, ఆ రాత్రి పరాంకుశం గదిలోకి రాగానే.

"అవును. మనకి పెళ్ళయిపోయింది. ఇప్పుడు మనం ఇద్దరం భార్యాభర్తలం." నవ్వి మృదువుగా చెప్పాడు.

మంచం మీద ఆమె పక్కన కూర్చునాడు.

"మరే, దేవుడు మొగుడూ - పెళ్ళాల లెక్కల పుస్తకంలో మనిద్దరి పేర్లు ఈ పాటికి రాసుకునుంటాడు."

"ఎవరు చెప్పారు?"

"నాతోపాటు ఉన్నవాళ్ళు చెప్పుకుంటుంటే విన్నాను. ఎవరిదైనా పెళ్ళైతే దేవుడు వెంటనే తన దగ్గరున్న ఇంత లావు పుస్తకంలో పేర్లు రాసుకుంటాడట."

చేతులు చాపి పుస్తకం ఎంత లావు ఉంటుందో చూపిస్తూ చెప్పింది సౌదామిని.

"చీర కట్టుకోవడం నీకు బాగా చేతనైంది."

"నాకు చీర బాగుండదు. లంగా, బాడీలే బాగుంటాయి."

కొన్ని క్షణాలు పరాంకుశం వంకే చూసింది సౌదామిని.

"ఏమిటి చూస్తున్నావు?" నవ్వుతూ అడిగాడు.

"నీకు తెలిసొస్తోందా సిగరెట్ మానటం ఎంత కష్టమో?" పకపకా నవ్వింది సౌదామిని.

ఎదురు చూడని సిగరెట్ ప్రసక్తికి పరాంకుశం కొద్దిగా హతాశుడయ్యాడు. సౌదామిని మాటల్లో 'నువ్వు సిగరెట్ మానలేవు' అన్న శ్లేష ధ్వనించింది.

జేబులోంచి సిగరెట్ పాకెట్ తీసి టేబుల్ మీద పడేసాడు. సౌదామిని దాన్ని ఆత్రంగా అందుకుని తెరచింది. ఖాళీ!

"ఓ! నువ్వు నిజంగానే సిగరెట్ మానేసావన్నమాట."

"అవును. నీకోసం ఏమైనా చేస్తాను తెలుసా?"

"ఐతే రా." చెయ్యి పట్టుకుని మంచం వైపు తీసుకువెళ్ళింది సౌదామిని పరాంకుశాన్ని.

"మనం ఇప్పుడు మొగుడూ పెళ్ళాలం కదూ." నవ్వుతూ పరాంకుశం భుజం చుట్టూ చెయ్యి వేసి మీదకి లాక్కుంది. పరాంకుశం చెవిలో రహస్యంగా ఏదో చెప్పింది.

"ఛీ! అలాంటి పాడు మాటలు మాట్లాడకు."

"తరువాత దేవుడి ముందులెంపలేసుకుంటాలే." బలంగా అదుముకుంది పరాంకుశాన్ని.

నాలుగే నాలుగు నిమిషాలు.

పరాంకుశం సరిగ్గా నాలుగే నాలుగు నిమిషాలు పెనుగులాడాడు సౌదామినితో. అయిదో నిమిషం ప్రవేశించిందంటే తను సౌదామిని చేతిలో మైనపు ముద్ద అయిపోతాడన్న సంగతి పరాంకుశానికి అంతదాకా తెలియదు. వశం తప్పిపోయాడు.

కిలకిలా నవ్వింది సౌదామిని విజయ గర్వంతో. పరాంకుశం మంచం మీద పడుకుని సీలింగ్ వంక చూస్తుండిపోయాడు, సౌదామిని అంటే ఏదో తెలియని కొత్త అనుభూతి, ఇష్టం, ప్రేమ పరాంకుశంలో రగులుకున్నాయి,

ఇంతదాకా సౌదామినిని మామూలుగా చూసాడు. అప్పుడు సౌదామిని చచ్చిపోయినా, పక్షవాతం వచ్చిపడిపోయినా బాధపడేవాడు కాదు.

కానీ, ఇప్పుడు ఈ ఇరవై నిమిషాల తర్వాత ఆ స్థితి దాటిపోయాడు. ఆ ఇరవైనిమిషాల అనుభవం అతన్ని మార్చేసింది. సౌదామిని లేకపోతే తను ఇక బ్రతకలేడేమో అనిపించింది పరాంకుశానికి. 'సౌదామిని నాది' అనుకున్నాడు.

చిత్రం! ఎందుకు ఇంత మార్పు తనలో? ఆలోచనకి అంతు పట్టలేదు. పరాంకుశం మానసికానందాన్ని అకస్మాత్తుగా పాడుచేసింది సౌదామిని.

పరాంకుశానికి చక్కలిగింతలు పెడుతూ చెప్పింది సౌదామిని.

"ఏభై తీసుకుంటాను తెలుసా? మొట్టమొదటిసారిగా ఫ్రీగా నీ దగ్గరే."

✷✷✷

*(తరువాయి భాగం వచ్చే సంచికలో)*

ఈ నవల క్రిందటి భాగాలు ఇంకా చదవలేదా..? లేక మళ్ళీ ఒకసారి చదువుదామనుకుంటున్నారా? వెంటనే కౌముది గ్రంధాలయాన్ని సందర్శించండి..

Click here to go to KOUMUDI Library

